# నేడే పోలింగ్

- ఐదు నియోజకవర్గాల పరిధిలో ఓటింగ్
- జిల్లావ్యాప్తంగా 1,456 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్లు 12,16,796 మంది
- ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం
- కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన నిఘా

ఖమ్మం, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1,456 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నది. ఉదయం 6 గంటలకే రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ఉంటుంది. పోలీస్‌శాఖ గుర్తించిన 195 గ్రామాల పరిధిలోని 392 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సాయుధ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. ఇవేకాక మరో 594 పోలింగ్ కేంద్రాలం సీసీ కెమెరాలు నిఘా ఉంచుతాయి. పోలింగ్ సందర్భంగా జిల్లాఅంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

### కలెక్టర్, సీపీ సందర్శన..

ప్రతి నియోజకవర్గంలో ఈసీ ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ కేంద్రాలను ఆకర్షణీయంగా అలంకరించింది. బుధవారం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది ఎలక్షన్ సామగ్రి తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ వి.పి.గౌతమ్, సీపీ విష్ణు



ఖమ్మం రూరల్: పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్ వారియర్ పరిశీలించి సిబ్బందికి పలు అంశాలపై సూచనలిచ్చారు. సిబ్బందికి టూత్ పేస్ట్ నుంచి ఇతర అవసరాలకు సంబంధించిన వస్తువులను ఈసీ ఒక కిట్‌లా అందజేసింది. ఎక్కడైనా ఈవీఎంలు మొరాయించినా అరగంట వ్యవధిలోనే వాటి స్థానంలో మరొక ఈవీఎంలు సమకూర్చేలా టెక్నీషియన్లు నియమితులయ్యారు. ప్రత్యేక మెనూ ప్రకారం ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లు ఉంటాయి. ఈ ఏర్పాట్లను గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

### సాయుధ బలగాల పర్యవేక్షణలో..

పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల అధికారులు ఈవీఎంలను అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య ఖమ్మం రూరల్ మండల పరిధిలోని తల్లంపాడు శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూంలకు తరలించనున్నారు. సాయుధ బలగాలు డిసెంబర్ 3 వరకు ఈవీఎంల భద్రతను పర్యవేక్షించనున్నాయి. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి ప్రభుత్వం పోలింగ్ నిర్వహణపై శిక్షణ పూర్తయింది. జిల్లావ్యాప్తంగా సుమారు 6 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం 12,16,796 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఇద్దరు సహాయకులతో విధులు నిర్వహించనున్నారు. వీరితో పాటు మరో 10శాతం మంది ఉద్యోగులు, అధికారులను జిల్లా ఎన్నికల అధికారి రిజర్వ్ చేశారు. వీరిని అత్యవసర సమయాల్లో వినియోగించుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా 1,456 మంది ప్రిసైడింగ్, 1,456 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోస్ 2,911 మంది విధులు నిర్వహిస్తారు.

### ఐదు నియోజకవర్గాల పరిధిలో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఇవే..

మామిళ్లగూడెం, నవంబర్ 29: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రతి నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ నెం-239, ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు మోమినాన్‌లో మహిళల మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటైంది. పోలింగ్ స్టేషన్ నెం-317, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజేంద్ర నగర్‌లో దివ్యాంగుల కేంద్రం ఏర్పాటైంది. పోలింగ్ స్టేషన్ నెం-146, 156, ఎస్ఆర్ఎండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాధరణ, యూత్ మోడల్ పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. పాలేరు నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ నెం-134, గుర్రాల పాడు ప్రాథమికోన్నత పాఠశాల ఖమ్మం రూరల్ మహిళలకు ఏర్పాటైంది. పోలింగ్ స్టేషన్ నెం-80 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోల్లపాడు దివ్యాంగుల కోసం సిద్ధమైంది. పోలింగ్ స్టేషన్-177 పాలేరు జిల్లా పరిషత్



ఖమ్మం: ఎన్నికల సిబ్బంది తీసుకెళ్తున్న సిబ్బంది

ఉన్నత పాఠశాల సాధారణ ఓటింగ్‌కు సిద్ధమైంది. మధిర నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ -228లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మధిరలో మహిళలకు, పోలింగ్ స్టేషన్ నెం-130, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జానకీపురంలో దివ్యాంగుల కోసం ఏర్పాటయ్యాయి. పోలింగ్ స్టేషన్ నెం-115 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోనకల్‌లో సాధరణ, యూత్ మోడల్ పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. వైరా నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ నెం-153, మండల పరిషత్ కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాల తనికెళ్లలో మహిళలకు, పోలింగ్ స్టేషన్-186, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చిన్నగోపతిలో దివ్యాంగులకు, పోలింగ్ స్టేషన్-205, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వైరాలో సాధారణ, యూత్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్-134, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పశ్చిమ బ్లాక్, వీఎం బంజరలో మహిళలకు, పోలింగ్ స్టేషన్-203, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కిష్టారంలో దివ్యాంగులకు, పోలింగ్ స్టేషన్-95, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నారాయణపురంలో సాధారణ, యూత్ మోడల్ పోలింగ్ స్టేషన్లు పోలింగ్‌కు సిద్ధమయ్యాయి.



ఖమ్మంలో ముస్తాబైన యూత్ మోడల్ పోలింగ్ కేంద్రం



ఖమ్మం నగరంలో ముస్తాబైన మోడల్ పోలింగ్ కేంద్రం



సత్తుపల్లిలో ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది




ఖమ్మంలో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న సిబ్బంది

## మధిర నియోజకవర్గంలో నిజాయితీ.. డబ్బుకు మధ్యే పోటీ

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు**

మధిర, నవంబర్ 29: మధిర నియోజకవర్గంలో నిజాయితీకి డబ్బుకు మధ్యే పోటీ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని ఆయన నివాసంలో కుమార్తె అభిజ్ఞ, కుమారుడు అభ్యుదయ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అనునిత్యం తన వెంటే ఉండి వేలాది మంది బీఆర్ఎస్ నాయకులు కొండంత ధైర్యాన్నిచ్చారన్నారు. తన గెలుపు నియోజకవర్గ ప్రజలకు ఎంతో అవసరమని భావిస్తున్నానన్నారు. తాను ప్రజల నుంచి జాలి పొందేందుకు యత్నిస్తున్నాననని, కాంగ్రెస్ పార్టీ నేతలు సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలను ఓటర్లు నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోవర్ట్ రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. ఇప్పుడు గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు.. ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఎన్నికల్లో గెలిస్తే సేవకుడిగా పనిచేస్తానన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు

## అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఐదు నియోజకవర్గాల్లో 9,66,439 మంది ఓటర్లు
- 1,098 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని 1,098 పోలింగ్ కేంద్రాల్లో గురువారం 9,66,439 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలిగ్ జరుగుతుందన్నారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో 95 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, తర్వాత మాక్ పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అనంతరం పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా, వెబ్‌కాస్టింగ్ ఉంటుందన్నారు. దివ్యాంగులు ఓటు వేసేందుకు 750 వీల్ చైర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల పనితీరును పర్యవేక్షించేందుకు ఈసీఐఎల్ నుంచి 15 మంది ఇంజినీర్లను అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో డీపీఆర్వో శ్రీనివాస్, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

## నిర్భయంగా ఓటు వేయండి: ఎస్పీ వినీత్ గంగన్న

చర్ల, నవంబర్ 29: ఓటర్లు నిర్భయంగా గురువారం ఓటు హక్కు వినియోగించుకోవచ్చని, పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందని భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న అన్నారు. చర్ల పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వివాదాస్పద పోలింగ్ స్టేషన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలను పోలీస్ బలగాలను మోహరించాయన్నారు. ఇప్పటికే రౌడీ షీట్ ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఓటేసేందుకు అమెరికా నుంచి తెల్దారుపల్లికి..

ఖమ్మం రూరల్, నవంబర్ 29: రూరల్ మండల తెల్దారుపల్లికి చెందిన యల్లంపల్లి సందీప్ అనే యువకుడు ఉద్యోగరీత్యా అమెరికాలోని చికాగోలో స్థిరపడ్డాడు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన గురువారం తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయన ఇప్పటికే సొంతూరుకు చేరుకున్నారు. ఈసందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. తనకు ఎన్ని పనులు ఉన్నప్పటికీ ఓటు హక్కును గౌరవిస్తూ స్వగ్రామానికి వచ్చానని, తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకుంటానన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



సందీప్